
www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 19 మే 2023
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు





మురుగునీటి శుద్ధి కేంద్రం పరిశీలన



నెల్లూరు :స్థానిక జనార్ధన్‌రెడ్డి కాలనీ ప్రాంతంలో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని కమిషనర్ వికాస్ మర్మత్ పరిశీలించారు. గురువారం కార్పొరేషన్ పబ్లిక్ హెల్త్, ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో కలిసి ఆయన ఈ కేంద్రాన్ని సందర్శించి అక్కడ జరుగుతున్న రీ సైక్లింగ్ ప్రక్రియను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ చర్యలలో భాగంగా నగర పాలక సంస్థ పరిధిలోని 53, 54 డివిజన్ల ప్రాంతాల మురుగునీరు డ్రైను కాలువల ద్వారా ప్లాంటుకు చేరుతుందని తెలిపారు. ఆ విధంగా సేకరించిన మురుగునీటిని రీ సైక్లింగ్ ప్రక్రియ ద్వారా సురక్షిత నీరుగా మార్చి వ్యవసాయ అవసరాలకు వినియోగించనున్నామన్నారు. పబ్లిక్ హెల్త్ ఎస్.ఈ గోపాల్ రెడ్డి, డి.ఈ అలీ, నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ సంపత్ కుమార్, ఈ.ఈ చంద్రయ్య, డి.ఈ అనిల్, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

సుందరయ్యకు విప్లవ జోహార్లు..!

సుందరయ్య పీడిత ప్రజలు ప్రతినిధి... సింహపురి గడ్డపై పుట్టి, కార్మిక, కర్షక, కష్టజీవుల ప్రతినిధిగా ఎదిగి..సింహపురి ప్రతిష్టను దశ దిశలా వ్యాపింపజేశారు... విడవలూరు మండలం, అలగానిపాడు గ్రామంలో జన్మించి, అక్కడ నుంచి ఉద్యమానికి నాంది పలికారు. వ్యవసాయ కార్మిక సంఘం ఏర్పాటు చేసి, కూలీ పోరాటాలు నిర్వహించారు. చిరుప్రాయం లోనే స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో జాతీయ జెండా పట్టుకొని పోరాటం చేశారు. స్వాతంత్ర్య ఉద్యమంతో పాటు, కమ్యూనిస్టు ఉద్యమంలోనూ ఆయనకు ఆయనే ప్రత్యేకత. గ్రామంలో దళితులు, పెత్తందార్లు మధ్య ఉన్న అంతరాలను తొలగించడానికి ప్రయత్నాలు చేశారు. .శతవసంతాలు దాటిపోయినా మీ జ్ఞాపకాలు ప్రజల మదిలోనే ఉన్నాయి. ..పేదలు, కార్మికులు, కర్షకులు, కష్టజీవుల కోసం జీవితాంతం పరితపించారు. ..మీరు దూరమైనా మీ ఆశయాలు ప్రజల గుండెల్లో ఉన్నాయి. . 1913 మే 1న విడవలూరు మండలం, అలగానిపాడు గ్రామంలో జన్మించిన ఆయన .1985 మే 19న అస్తమించారు. ఓ సాధారణ వ్యక్తిగా వచ్చి ప్రపంచానికి పరిచయమై మనలను వదిలి వెళ్లి 38 సంవత్సరాలు గడిచాయి. ఆయన జ్ఞాపకాలు మనలో ఉన్నాయి..

నేడు 38 వర్ధంతి

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి


పుచ్చలపల్లి సుందరయ్య కోట్లాది మంది గుండెచప్పుడు.. తుదిశ్వాస వరకు ఎర్రజెండాను దేశవ్యాపితంగా రెపరెపలాడించిన విప్లవమూర్తి. కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య నిరాడంబరతకు నిలువుటద్దం..నిత్య అధ్యాయన శీలి. క్రమశిక్షణకు పెట్టింది పేరు.. అపార విజ్ఞానవంతుడు.. తెల్లటి పైజామాలో గొంగళిపైన కప్పుకొని నిర్మలంగా కనిపించే విప్లవమూర్తి. విడవలూరు మండలం, అలగానిపాడు గ్రామంలో పుచ్చలపల్లి శేషమ్మ, వెంకటరామిరెడ్డి దంపతులకు 1913 మే 1న భూస్వామ్య కుటుంబంలో జన్మించారు. బాల్యం నుంచే అభ్యుదయ భావాలు పెంపొందించుకున్నారు. అమీర్ హైదర్‌ఖాన్ ప్రోత్సాహం, స్ఫూర్తితో కమ్యూనిస్టు ఉద్యమం వైపు అడుగులేశారు. చివర వరకు పీడిత, తాడిత ప్రజల విముక్తి కోసం పోరాడారు.

చిన్న గ్రామం నుంచే..!

సుందరయ్య తన స్వగ్రామం అలగానిపాడు నుంచే ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. 15 సంవత్సరాల పసిప్రాయంలో ప్రజల కోసం పెద్దలను ఎదిరించి నిలిచారు. వ్యవసాయ కార్మిక సంఘం స్థాపించారు. అక్కడ నుంచే ఉద్యమం ప్రారంభించారు. వ్యవసాయ కూలీలకు న్యాయమైన కూలీలు అందించేందుకు ఆయన పునాది వేశారు. 1936లో గ్రామంలో కూలీ సంరక్షణ సంఘం ఏర్పాటు చేశారు. దానిని రాష్ట్ర వ్యాపితంగా విస్తరించి వ్యవసాయ కార్మిక సంఘం నిర్మించారు. ఆ సంఘం ఇప్పుడు దేశవ్యాపితంగా వ్యవసాయ కార్మికులకు అండగా అతి పెద్ద సంఘంగా ఏర్పడింది. సుందరయ్య స్ఫూర్తితో దేశంలో అనేక కూలీ పోరాటాలు సాగుతున్నాయి. స్వామీ వివేకానంద ఉపన్యాసాలకు సుందరయ్య ఆకర్షితులయ్యారు. ఆయన సోదరులు డాక్టర్ రామచంద్రారెడ్డి అన్నబాటలోనే నడిచారు. పేద ప్రజల పట్ల ప్రేమానురాగాలు పెంపొందించుకొని ప్రజల మనుషులుగా మారిపోయారు. సుందరయ్య రష్యా సోషలిజం- విప్లవం గురించి అధ్యయనం చేశారు. ఉత్తర భారతదేశం నుంచి దక్షణ భారత దేశానికివచ్చిన అమీర్ హైదర్‌ఖాన్ సుందరయ్యను ఎంతగానో ప్రోత్సహించి కమ్యూనిస్టుపార్టీ అభివృద్ధికి బాటలు వేసేలా చేశారు. దేశం గర్వించదగ్గ నేతగా ఆయన ఎదిగారు. ఇప్పటికీ సుందరయ్య చరిత్రను రాజకీయ నేతలు అధ్యయనం చేస్తారంటే ఆయన నిబద్ధత, నిజాయతీ అర్ధమౌతుంది. చిన్నపాటి పదవివస్తేనే కోట్ల సంపాదించుకునే ఈ రోజుల్లో ఆయన తన ఆస్తిని సైతం పేదల కోసం ఖర్చుచేసిన త్యాగజీవి. పార్లమెంట్‌కు సైకిల్‌పై వెళ్లిన ఒకే ఒక్కరు మన సుందరయ్య. ఇది ఇప్పటికీ కథలు కథలుగా చెప్పు కుంటారు. నేటి తరం రాజ కీయ నాయకులకు ఆయన స్ఫూర్తి ప్రధాత. అది మన సుందరయ్య నిజాయతీ, ఆ మహాను భావుడు వర్ధంతి నేడు . ఆయన జ్ఞాపకాలు మాత్రం మనపక్కనే బుజంతట్టి నిద్రలేపుతు న్నాయి. ఆయన స్ఫూర్తితో పనిచేసినప్పుడే ఆయనకు మనమిచ్చే నివాళి. సుందరయ్య విశాలాంధ్రలో ప్రజారాజ్యం రావాలి, చూడాలని పోరాటం చేశారు. 1942లో విశాలాంధ్రలో ప్రజారాజ్యం అనే పుస్తకం రచించారు. సుందరయ్య ఆశించినట్లు మద్రాసు నుంచి రాష్ట్రం విడిపోయి తెలంగాణ, రాయలసీమ, కోస్తా ప్రాంతాలు ఒక్కటై విశాలాంధ్ర ఏర్పడింది. ప్రజా రాజ్యం కోసం సుందరయ్య పరితపించారు. రాష్ట్రంలోని వనరులు, అభివృద్ధిపై సమగ్ర అవగాహన కలిగిన నేత ఎవరైనా ఉన్నారంటే అప్పట్లో సుందరయ్య మాత్రమే. విశాలాంధ్ర రెండు ముక్కలైపోయింది. పాలకులు ప్రజా సంక్షేమం, అభివృద్ధి, నిజాయతీ వంటి అంశాలను పట్టించుకోకుండా పదవంటే కేవలం అధికారం కోసం అనేలా వ్యవహరిస్తున్నారు. సుందరయ్య లాంటి మహాను భావులను స్మరించుకుంటేనే భావితారాలకు భవిష్యత్తు ఉంటుంది. తరాలు మారినా, యుగాలు గడిచినా సుందరయ్య ముద్ర ప్రజల్లో ఎప్పటికీ ఉంటుంది.

సామాజిక ఉద్యమాలకు నాంది...!

సుందరయ్య కేవలం స్వాంత్ర పోరాటం, కమ్యూనిస్టు ఉద్యమమేకాదు. సామాజిక ఉద్యమాలకు తనదైన శైలిలో పనిచేశారు. తన చిన్ననాడే కులవివక్షను వ్యతిరేకించారు. తన పేరులోని రెడ్డి ఓ సామాజిక వర్గాన్ని తెలుపుతుందనే ఉద్దేశంతో ఆ పదాన్ని తొలగించుకున్నారు. అప్పటి నుంచి ఆయనను సుందరయ్యగా నిలిచిపోయారు. గ్రామంలో వివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేశారు. ఊర్లో ఉన్న నీళ్ల బావిలో దళితులు నీళ్లు తీసుకోడానికి అవకాశం లేకుండా పెత్తందారులు చేశారు. దీనిపై ఆయన పెత్తందారులతో యుద్ధమే చేశారు. దళితవాడ, ఊర్లో ఉన్న బావిలోని నీళ్లు కలిపి అందరూ ఒక్కటేనని కులం లేదని నిరూపించారు. ఊర్లో జరిగే వేడుకలకు దళితులను దూరంగా పెట్టడడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరినీ కలిపి సహబంతి భోజనాలు ఏర్పాటుచేశారు. సుందరయ్య తుది శ్వాసవరకు పేదల కోసమే ఆలోచించారు. జీవించారు. ఆరోగ్య సహకరించకపోయినా పార్టీ, ప్రజల కోసం పనిచేశారు. ఆయనకు మూడు ఆపరేషన్లు జరిగాయి., కామెర్లు కావడంతో 1953లో ఢిల్లీలో ఒకసారి ఆపరేషన్ చేశారు. పేగుల్లో పుండు ఏర్పడడంతో మళ్లీ మద్రాసులో చేశారు. మూడో సారి 1960లో రష్యాలో ఆపరేషన్ చేశారు. వైద్యులు వదిలిన చిన్న పేగు ... రెండు గంటల వరకు నిద్రపోయేవారు కాదు. 1985 మే 19న మద్రాసులో అనారోగ్యంతో బాధపడుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మన నుండి దూరమై 38 సంవత్సరాలు గడిచింది. నేడు ఆయన వర్ధంతి. ఆయన జ్ఞాపకాలు మాత్రం అలాగే ఉండిపో యాయి. ఆయన వదిలి వెళ్లిన బాధ్యతలు మన ముందు అలాగే ఉన్నాయి. సుందరయ్య లాంటి నేతల కోసం ఇప్పుడు దేశం ఎదురుచూస్తుంది. సుందరయ్యకు దేశం జోహార్లు చెబుతోంది..



పుచ్చలపల్లి సుందరయ్య

మహిళా రెజ్లర్లకు రక్షణ కల్పించాలి

ఐద్వా, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సంతకాల సేకరణ



ప్రజాశక్తి-నెల్లూరు

నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ ప్రాంతంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఢిల్లీలో న్యాయపోరాటం చేస్తున్న మహిళా రెజ్లర్లకు మద్దతుగా సంతకాల సేకరణ చేపట్టారు. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఐద్వా జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్ బి మాట్లాడారు. గౌరవం, న్యాయం కోసం పోరాడుతున్న మహిళా రెజ్లర్లకు సంఘీభావాన్ని తెలియజేస్తున్నామన్నారు. అంతర్జాతీయంగా దేశానికి ఖ్యాతి తెచ్చి పెట్టిన భారత మహిళా రెజ్లర్లపై లైంగికంగా వేధింపులకు పాల్పడుతున్న బిజెపి ఎంపి బ్రిజ్‌భూషణ్ చరణ్‌సింగ్‌పై చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. సుప్రీంకోర్టు జోక్యంతో ఎఫ్ఐఆర్ నమోదు చేశారన్నారు. కేసు నమోదు చేసినప్పటికీ పోలీసులు ఇప్పటి వరకు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని అదుపులోకి తీసుకోక పోవడం దుర్మార్గమన్నారు. శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ డి అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ నిరసన తెలిపే మల్లయోధులకు రక్షణ కల్పించాలన్నారు. నిరసనకారులు, జర్నలిస్టులపై క్రూరమైన దాడికి పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోవాలన్నారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రమణ, నరసింహ సంఘీభావంగా మాట్లాడారు. ఐద్వా నగర అధ్యక్ష కార్యదర్శులు కె. పద్మ సుబ్బమ్మ అంగనవాడి జిల్లా కార్యదర్శి షేక్ రెహానా బేగం ఐద్వా నాయకులు షేక్ శంషాద్ షేక్ రెహనుమా తదితరులు పాల్గొన్నారు

ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్ష

ప్రజాశక్తి-నెల్లూరు :ప్రభుత్వం 15 రోజుల క్రితం జిల్లాకు కేటాయించిన గృహ నిర్మాణ లక్ష్యాన్ని అధిగమించడమే కాకుండా ప్రథమ స్థానంలో నిలవడం పట్ల కలెక్టర్ హరి నారాయణన్‌ను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్.జవహర్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్‌లు అభినందించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్ జవహర్ రెడ్డి గురువారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్నకు చెబుదాం, గహ నిర్మాణం, రీ సర్వే, జాతీయ రహదారుల, ప్రాజెక్టులకు భూసేకరణ, వ్యవసాయం, పశు సంవర్ధక శాఖల ప్రగతి తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ ఎం హరి నారాయణన్ తన చాంబర్ నుంచి జాయింట్ కలెక్టర్ కూర్మానాథ్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి అజయ్ జైన్ మాట్లాడుతూ గత 15 రోజులకు సంబంధించి జిల్లాలకు ఇచ్చిన జగనన్న ఇల్లు నిర్మాణ లక్ష్యాలు సాధించడంలో జిల్లా మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ప్రభుత్వ ప్రధాన



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

కార్యదర్శి జవహర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలు జగనన్నకు చెబుదాం, గహ నిర్మాణం, రీ సర్వే,భూహక్కు పత్రాల పంపిణీ, ప్రాజెక్టుల భూ సేకరణ, జగనన్న పాలవెల్లువ, పాడి పశువుల పంపిణీ తదితర అంశాలపై కలెక్టర్లు ప్రత్యేక దష్టి సారించాలని సూచించారు.డిఆర్ఒ వెంకటనారాయ ణమ్మ, డిఆర్‌డిఎ డ్వామా పీడీలు సాంబశివారెడ్డి, వెంకట్రావు, జిల్లా వ్యవసాయ అధికారి సుధాకర్ రాజు, పంచాయతీ అధికారి సుస్మిత, ల్యాండ్ రికార్డుల శాఖ ఏడి హనుమాన్ ప్రసాద్, హౌసింగ్ ఈఈ నాగరాజు, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఎస్ఈలు రంగవరప్రసాద్, అశోక్ కుమార్ ఉన్నారు.

19న సదస్సు..!

ప్రజాశక్తి -నెల్లూరు :డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 'నేను ఎవరినీ' రేపు సదస్సు నిర్వహించనున్నట్లు ఆసంస్థ ప్రతినిధులు ప్రకటించారు. డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాన్ని ఎన్‌సిఆర్‌ఇటి పుస్తకం నుండి తొలగించిన నేపథ్యంలో డార్వినిజం–శాస్త్రీయత, అవశ్యకత పేరుతో సదస్సు నిర్వహంచనున్నారు. శనివారం సాయంత్రం 5.30 గంటలకు జెవిస్ ట్రస్టులో వ్యక్తులుగా జనవిజ్ఞాన నేత ఎంవి చలపతి, నేను ఎవరినీ ? ఎక్కడ నుండి వచ్చాను? అనే అంశంపై గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ అసోసి యేట్ ప్రొఫెసర్ డాక్టర్ కాలేషా బాషా ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగిం చనున్నారు. విజయవంతం చేయాలని ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు.

'నాడు -నేడు' పనులపై సమీక్ష

ప్రజాశక్తి -కందుకూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నాడు–నేడు అభివృద్ధి పనులపై ఎంపిడిఒ పి.విజయశేఖర్ గురువారం సమీక్షించారు. సమావేశంలో ఎంఇఒ వెంకటేశ్వర నాయక్, ఎఇ(ఆర్‌డబ్యుఎస్) ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, ప్రధా నోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- నెల్లూరు :నగరంలోని స్టోన్ హౌస్ పేట,తడికల బజార్ లోని ఆర్ఎస్ఆర్ పురపాలక ఉన్నత పాఠశాలలో గురువారం నుంచి 5 రోజుల జిల్లా స్థాయి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల (సెకండరీ గ్రేడ్ టీచర్ల) ఇండక్షన్ శిక్షణా కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులకు మెడికవర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచితంగా బి.పి, సుగర్ ,ఇ.సి.జి పరీక్షలు నిర్వహించారు. ఈ మేరకు కోర్సు సమన్వయ కర్త ,ప్రభుత్వ డైట్, పల్లిపాడు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు.



వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

సచివాలయంలో తనిఖీ

ప్రజాశక్తి -కందుకూరు :ఎంపిడిఒ పి.విజయశేఖర్ మాచవరం గ్రామ సచివాలయాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. సచివాలయ సిబ్బంది సమయ పాలన పాటించాలని, ప్రజా సమస్యలపై బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని పురస్కరించుకొని మండలంలోని నరుకూరు సెంటర్లో ఈ నెల 19వ తేదీన ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి వేగూరు వెంకయ్య, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు మారుబోయిన రాజా గురువారం తెలిపారు. వారు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య ప్రముఖ కమ్యూనిస్టు నాయకుడని పేర్కొన్నారు. అంతేకాకుండా సుందరయ్య తెలంగాణా రైతాంగ సాయుధ పోరాట వీరుడు, స్వాతంత్ర్య సమర యోధుడని కొనియాడారు. సిఐటియు, సిపిఎం ఆధ్వర్యంలో ఈ ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నెల్లూరు నగరంలోని ప్రముఖ మెడికవర్ హాస్పిటల్ బందం ఉచితంగా బిపి, షుగర్ పరీక్షలు నిర్వహిస్తుందని తెలిపారు.

వేసవిలో ప్రజలు అప్రమత్తం

ప్రజాశక్తి -కందుకూరు :ఎండల తీవ్రత ఎక్కువగా వున్న కారణంగా వడదెబ్బకు గురికాకుండా ప్రజలు జాగ్రత్త వహించాలని మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ స్వాతి సూచించారు. గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా పాలూరు–దొండపాడు సచివాలయం పరిధిలోని పాలూరు, దొండపాడు గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఎండల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఎఎన్ఎం దగ్గర, ఆశ దగ్గర అందుబాటులో వుంచామని తెలిపారు. సద్వి నియోగం చేసుకోవాలని సూచించారు. ఎఎన్ఎం జయంతి, ఆశ కార్యకర్తలు రమణమ్మ, హేమలత, ఎంఎల్‌హెచ్‌పి ఆలేఖ్య, హెల్త్ ఆసిస్టెంట్ శ్రీధర్ బాబు ఉన్నారు.

ఎఇ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి -కందుకూరు :భగభగ మండే ఎండల సైతం లెక్కచేయకుండా ఎఇ మధు బాబు, పట్టణంలోని ఏ ప్రాంతంలో విద్యుత్ పోయినా వాట్సప్ లో, కాల్ చేసి చెప్పినా వెంటనే వారి బృందం వెళ్లి విద్యుత్ మరమ్మతులు చేస్తోంది. వేసవిలో పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా విద్యుత్ సేవలందించడంపై పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలపుతున్నారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

20న ధర్నా

ప్రజాశక్తి-నెల్లూరు :చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని చేనేత,జౌళి శాఖ (ఎ.డి) కార్యాల యం ఎదుట ఈ నెల 20న ధర్నా నిర్వహిస్తు న్నట్లు కన్వీనర్ కటికాల వెంకటేశ్వర్లు, ఎ. తిరుపాల్, ఎం.రామచంద్రయ్య పేర్కొన్నారు. గురువారం నగరంలోని ఏపి చేనేత కార్మిక సంఘం కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్పోరేట్ విధనాల వల్ల చేనేత పరిశ్రమ సంక్షోభంలో చిక్కుందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేనేతపై జిఎస్‌టి విధించడమే కాకుండా 2022లో చేనేత పరిశ్రమకు అవసరమైన నూలు , పట్టు ధరలు వంద శాతం పెంచడం దారుణమన్నారు. చేనేతకు కేటాయించిన 11 రకాల రిజర్వేషన్లు ఖచ్చితంగా అమలు చేయాల న్నారు. ప్రతి చేనేత కార్మికుడికి అంత్యోదయ కార్డు అందజేయాలన్నారు. చేనేత కార్మికులకు వెల్ఫేర్ ఫండ్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. హెల్త్ కార్డులు అందజేయాలన్నారు. చేనేత పరిరక్షణకు, చేనేత కార్మికుల జీవనోపాది మెరుగుదలకు ప్రభుత్వం తక్షణమే స్పందించి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని చేనేత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



మాట్లాడుతున్న కటికాల వెంకటేశ్వర్లు

అక్రమాలను ప్రశ్నిస్తే బెదిరింపులు : ఇంటూరి

ప్రజాశక్తి -కందుకూరు

కందుకూరు నియోజకవర్గంలో వైసిపి నాయకులు అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆరోపించారు. గురువారం ఆయన ఇక్కడ విలేకర్లతో మాట్లాడారు. వలేటివారిపాలెం మండలం, పోకూరు చెరువులో పది అడుగుల లోతున గుంతలు తీసి వైసిపి నాయకులు మట్టి తరలిస్తుంటే ఇరిగేషన్ అధికారులకు పట్టడం లేదన్నారు. గుడ్లూరు మండలం చేవూరు వద్ద చెరువు నుంచి రామాయపట్నం పోర్టుకు అక్రమంగా గ్రావెల్ తరలిస్తుంటే గోచిపాతల రమేష్ అనే దళిత యువకుడు ప్రశ్నించి అడ్డుకునేందుకు ప్రయత్నించాడన్నారు. గుడ్లూరు ఎస్ఐ ఆ దళిత యువకుడిని బెదిరించి స్టేషన్‌కు తరలించారన్నారు. రౌడీ షీట్లు ఓపెన్ చేస్తానని బెదిరించాడన్నారు. ఎస్ఐ తన ఉద్యోగ బాధ్యతలను మరిచిపోయి వైసిపి నాయకులకు తొత్తుగా వ్యవహరిస్తు న్నారన్నారు. పోలీసులు తీరు మార్చుకోకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కందుకూరు నియోజకవర్గంలో ఇదేమి ఖర్మ కార్యక్రమంలో ప్రజల సమస్యలు తెలుసుకొని ఆ సమస్యలను టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకి మహానాడులో అందజేస్తా మన్నారు. టిడిపి నాయకులు గోచిపాతల మోషే ,చిలకపాటి మధు ,బెజవాడ ప్రసాదు, పొడపాటు మహేష్ ఉన్నారు.



మాట్లాడుతున్న ఇంటూరి నాగేశ్వరరావు

స్వీపర్లకు కనీస వేతనాలివ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి-వలేటివారిపాలెం :ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని సిఐటియు డిమాండ్ చేసింది. మండల స్థాయిలో అన్ని పాఠశాలల్లో పని చేసే స్వీపర్ల సమావేశం మండల కేంద్రమైన వలేటివారి పాలెంలోని విద్యావనరుల కేంద్రం ఆవరణలో గురువారం సిఐటియు ఆధ్వర్యంలో జరిగింది. సిఐటియు జిల్లా నాయకులు జివిబి కుమార్ మాట్లాడారు. నాడు–నేడు పథకం కింద చేరిన ఆయాలు గత నాలుగేళ్లుగా వివిధ పాఠశాలల్లో మంచినీళ్లు తెచ్చిపెట్టడం, చిమ్మడం, మరుగుదొడ్లను శుభ్రం చేయడం వంటి పనులు చేస్తున్నారన్నారు. వారికి కనీస వేతనం అమలు చేసి, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని కోరారు. కెవిపిఎస్ జిల్లా నాయకులు గుండ్లతోటి మాధవమూర్తి, స్వీపర్లు ఎండ్లూరి రాహేలమ్మ, జడ సుజాత, గంగవరపు భాగ్యం, కూడల మల్లేశ్వరి, బొమ్మినేని రాజమ్మ, లింగాబత్తిన ఆదిలక్ష్మీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జివిబి కుమార్

'నాడు -నేడు' పనుల పరిశీలన

ప్రజాశక్తి - గుడ్లూరు :మండలంలోని మోచర్ల గ్రామంలోని ఎంపిపి స్కూల్లో జరుగుతున్న నాడు -నేడు అభివృద్ధి పనులను మండల ఇంజినీర్ వేణు గోపాల్, ఎంఇఒ ప్రసా దరావు ,అసిస్టెంట్ ఇంజనీరు సుమతి, సి ఆర్ పి సుభాని గురువారం పరిశీలించారు. మిగిలి ఉన్న పనులను ఈ నెలాఖరు లోపు పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు.



పరామర్శిస్తున్న మంద కృష్ణ మాదిగ

మంద కృష్ణ పరామర్శ

ప్రజాశక్తి -కందుకూరు : ఎంఎస్‌పి రాష్ట్ర నాయకులు వర్ల దేవదాసు సతీమణి వర్ల శాంతి దేవదాసుని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ గురువారం పరామర్శించారు. ఇటీవల శాంతి తల్లి మరణించిన విషయం తెలుసుకున్న మంద కష్ణ వారి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. ఎంఆర్‌పిఎస్ నాయకులకు కార్యకర్తలకు అన్నం పెట్టిన సంగతిని గుర్తు చేశారు. ఈ సందర్భంగా వర్ల దేవదాసు మాట్లాడుతూ దుఖంలో ఉన్న నా యొక్క సతీమణిని ఓదార్చి మనోధైర్యం కల్పించిన తమ అధి నాయకులు మంద కృష్ణ నాయకత్వంలో పని చేయడం తమకు ఎంతో సంతోషానిస్తుందన్నారు. పరామర్శించిన వారిలో జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు, ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి బిక్షాలు, ఎంఆర్‌పిఎస్ జాతీయ ఉపాధ్యక్షులు జలదంకి నరసిం గరావు, మహాజన సోషలిస్ట్ పార్టీ ఉమ్మడి జిల్లా కన్వీనర్లు బుడంగుంట్ల లక్ష్మీనరసయ్య, తోరటి ఆనంద్, ఎంఆర్‌పిఎస్ జిల్లా కన్వీనర్ ఆదిములపు ప్రకాశం ఉన్నారు.

గడప గడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు : సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా గడప గడపకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని విలుకానిపల్లిలో గడ ప గడపకు మన ప్రభుత్వం కా ర్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల సంక్షే మం, అభివద్ధే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఏ విధంగా అమలు పరుస్తున్నారో, వాటి వల్ల ప్రజల పొందుతున్న సంతప్తిని తెలుసుకునేందుకు "జగనన్నే మా భవిష్యత్తు" కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. తొలుత కోటి రూపాయలతో నిర్మించిన అంతర్గత సిమెంట్ రోడు నిర్మాణాన్ని మంత్రి ప్రారంభించారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్ రెడ్డి, కన్వీన ర్ ఉప్పల శంకరయ్య గౌడ్, ఎంపీపీ స్వర్ణలత, జెడ్పిటిసి శేషమ్మ, మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్, కాల్తిరెడ్డి సుబ్రహ్మణ్యం, ఆకుల మధు, ఎంపిడిఒ హేమలత, తహశీల్దార్ శివయ్య, ఏరియా కో ఆర్డినేటర్ శ్రీనివాసులు ఉన్నారు.



ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి..

ప్రజాశక్తి -పొదలకూరు :పొదలకూరు మేజర్ పంచాయతీ పరిధిలోని లింగంపల్లి అరుంధతివాడలో టిడిపి నాయకులు ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం గురువారం నిర్వహించారు. టిడిపి నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి టిడిపితోనే సాధ్యమన్నారు. యువత నాయకుడు డేగ యశ్వంత్ రెడ్డి, పెద్దలు బోగోలు భాస్కర్ రెడ్డి, షేక్ జమీర్ భాష, పెనుమల్లి జనార్ధన్ రెడ్డి, నవీన్, మాజీ ఎంపీటీసీ కొంగి మస్తానమ్మ,కొంగి రమణయ్య,గుంటి సుబ్బరామయ్య, కోంగి గణేష్, యశ్వంత్, మనోహర్ , రంగయ్య,పెంచలయ్య, గోవిందు ఈశ్వరయ్య, రాగయ్య, తదితరులు పాల్గొన్నారు.



పొదలకూరులో..

వలేటివారిపాలెం : మండలంలోని పోలినేనిపాలెంలో టిడిపి ఆధ్వర్యంలో 'ఇదేమి కర్మ రాష్ట్రానికి" కార్యక్రమం గురువారం జరిగింది. పార్టీ నేతలు ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. మండల పార్టీ అధ్యక్షులు మాదాల లక్ష్మీనరశింహం మాట్లాడుతూ ఒక్కఛాన్స్ ఇవ్వడం వల్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని ఎలా నాశనం చేశాడో ప్రజలు గమనించాలన్నారు. నిత్యావసరాల ధరలు, ఛార్జీలు విపరీతంగా పెరిగాయన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపికి ప్రజలు మద్దతు పలకాలన్నారు. గ్రామపార్టీ అధ్యక్షులు మానికొండ కొండయ్య, టిడిపి నాయకులు కాకుమాని హర్ష, నవులూరి రాజారమేష్, మాదాల చిరంజీవి, చింతలపూడి మాధవ, ఎం మదన్, ఎండ్లూరి ఏసు, గాజులవర్తి మోషే తదితరులున్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -కందుకూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ అభివద్ధి అధికారి పి. విజయ్ శేఖర్, ఎంఇఓ వెంకటేశ్వర నాయక్ 'ఎల్డర్ లైన్ 14567' బ్రోచర్‌ను గురువారం ఆవిష్కరించారు. భారత పౌరులందరికి రాజ్యాంగం కల్పించిన కొన్ని ప్రాథమిక హక్కులు ఉన్నాయి. వయోవద్ధులు అందుకు మినహాంపు కాదు. అయితే వివిధ కారణాల వల్ల వారు ఆ హక్కులు పొందాలేకపోతున్నారు.ఈ నేపథ్యంలో వారికి భరోసా కల్పించేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తీసుకొచించది.అందుకు సం బంధించిన 14567 నెంబర్ గల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఆ ప్రోగ్రామ్ యొక్క ప్రాధాన్యాన్ని వివరించారు. ఆ టోల్ ఫ్రీ నెంబర్ నెంబర్‌ను వయో వద్ధులకు తెలియజే యుటకు ఉపాధి కార్యాలయంలో సచివాలయం సిబ్బం దికి, పంచాయతీ కార్యదర్శులకు ఫీల్డ్ అసిస్టెంట్లు ,టెక్నికల్ అసిస్టెంట్స్, ఇంజి నీరింగ్ కన్సల్టెంట్స్ వారి ద్వారా ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఎల్డర్ లైన్ ఫీల్డ్ రెస్పాన్సి ఆఫీసర్ పాటిబండ్ల జాన్ బాబు మాట్లాడారు.

కలెక్టర్‌ను కలిసిన ఎంఎల్‌సి 'మేరిగ'

ప్రజాశక్తి -నెల్లూరు :ఎంఎల్‌సి మేరిగి మురళీధర్ గురువారం సాయంత్రం కలెక్టర్ జి .హరి నారాయణ ,జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. కూర్మానాథ్, జిల్లా రెవెన్యూ అధికారిని డి .వెంకటనారాయణమ్మ లను మర్యాదపూర్వకంగా కలిశారు. వేర్వేరుగా వారిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేవారు. ఈనెల 18న మేరీగ మురళీధర్ వెలగపూడి లోని శాసనమండలి ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం చేశారు అనంతరం అక్కడి నుంచి నెల్లూరు వచ్చిన ఆయన జిల్లా అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు.



కలెక్టర్‌ను కలిసిన ఎంఎల్‌సి మేరిగ

సరైన పత్రాల్లేని వాహనాలకు జరిమానా

ప్రజాశక్తి-మర్రిపాడు: మండలంలోని నెల్లూరు ముంబై జాతీయ రహదారిపై చుంచులూరు క్రాస్ రోడ్డు వద్ద ఆత్మకూరు వాహనాల తనిఖీ అధికారి రాములు తనిఖీలు చేపట్టారు.సరైన పత్రాలు లేని వాహనాలకు జరిమానా విధించారు.ఈ తనిఖీల్లో ఇసుక లోడుతో బద్వేల్ వైపు వెళ్తున్న ఒక ట్రాక్టర్‌ను ఆపి డ్రైవర్ కు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించారు.ట్రాక్టర్ డ్రైవర్ మద్యం సేవించినట్లు గుర్తించి డ్రైవర్ పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి-ఇందుకూరుపేట: మండలంలోని చాముండేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్ద బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని గురువారం తహశీల్దార్ సుబ్బయ్య అధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా వైసిపి మండల కన్వీనర్, కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మావులూరు శ్రీనివాసుల రెడ్డి విచ్చేశారు.ఈ సందర్భంగా దేవస్థానం కార్యనిర్వహణ అధికారి శాంతయ్య సూచనల మేరకు పలు ప్రభుత్వ విభాగాల అధికారులతో బ్రహ్మోత్సవాలు సజావుగా జరిగేందుకు చర్చించారు. తహశీల్దార్ సుబ్బయ్య అధికారులకు పలు సూచనలు అందించారు. బ్రహ్మోత్సవాలలో వాంఛనీయ సంఘటనలు జరగకుండా లాండ్ ఆర్డర్ పై ఎస్ఐ రాజేష్ గ్రామ పెద్దలకు పలు రకాల జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ నాగేంద్ర బాబు, సర్పంచ్ సాయి నిరంజన్, మాజీ దేవస్థానం చైర్మన్ కొండూరు కష్టారెడ్డి, స్థానిక వైసిపి నాయకులు పంబాల జనార్దన్ రెడ్డి, వైస్ సర్పంచ్ కొండూరు వెంకటరమణారెడ్డి, మండల అధికార ప్రతినిధి దండిగుంట ఫణీంద్ర నాయుడు, గుండాల కష్టారెడ్డి, మాజీ ట్రస్ట్ బోర్డ్ మెంబర్ ఫకీర్, సెక్రటరీ వీరయ్య, విఆర్ఓ మురళి, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

ప్రజాశక్తి-కావలి: పట్టణంలో వెంగళరావు నగర్‌లోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆ పాఠశాల ప్రిన్సిపల్ ఎం.విజయ లక్ష్మి గురువారం తెలిపారు. స్థానిక గురుకులంలో ఆమె మాట్లాడుతూ పాఠశాలలో 2023-2024 సంవత్సరంలో ప్రవేశానికి మూడో తరగతిలో 40 సీట్లను 32సీట్లు పట్టణంలో వెంగళరావు నగర్‌లోని గిరిజన బాలుర గురుకుల పాఠశాల లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. గురుకులంలో పాఠశాలలో 2023-2024 సంవత్సరంలో ప్రవేశానికి మూడో తరగతిలో 40 సీట్లను 32సీట్లు - ఎస్.టి.కె , 5సీట్లు- ఎస్.సి.కె , 2సీట్లు- బి.సి.కె , 1 సీట్లు - ఓ.సి. రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం ఇవ్వనున్నారు. బ్యాక్ లాగ్ సీట్లు వరుసగా నాల్గవ తరగతి లో 38 సీట్లు, ఐదవ తరగతి లో 31 సీట్లు, ఆరవ తరగతి లో 29, 8 వ తరగతి లో 7 సీట్లు, 9వ తరగతిలో 12 ఉన్నాయని చెప్పారు. 4వ తరగతి నుంచి 9 వ తరగతి వరకు బ్యాక్ లాగ్ సీట్లు కేవలం గిరిజన విద్యార్థులకు మాత్రమే కేటాయిస్తారని చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు ఎంపిక నెల్లూరు లోని ఐటిడిఏపిఓ కార్యాలయంలో లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తారన్నారు.వివరాలకు 9490452841, 9866829720 నంబర్లలో సంప్రదించాలని చెప్పారు.


మాట్లాడుతున్న ఎంపిడిఒ విజయభాస్కరరావు

నాడు-నేడు పనులను పూర్తి చేయాలి

ప్రజాశక్తి-వరికుంటపాడు: మండలంలో జరుగుతోన్న నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయించాలని ఎంఇఒ షేక్ షావుద్దీన్, ఎంపిడిఒ విజయభాస్కరరావు సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలోని శ్రీ శక్తి భవనంలో నాడు-నేడు పనులపై గురువారం ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాడు నేడు పనులను జూన్ 12లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. దానికి అనుబంధంగా ప్రణాళికలను సిద్ధం చేసుకుని రోజు వారి పనులతో వేగవంతం చేసి పనులు పూర్తిచేసే విధంగా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస రెడ్డి, బాల భాస్కర్, సర్వ శిక్ష అభియాన్ ఎఇ కష్టారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కుడితిపాలెంలో సర్వే టీం

ప్రజాశక్తి-ఇందుకూరుపేట: మండలంలోని కుడితిపాలెం గ్రామంలో రెవెన్యూ, సర్వే అధికారులు సంయుక్తంగా రైతుల పొలాలలో సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విఆర్ఓ రాఘవరెడ్డి మాట్లా డుతూ ప్రభుత్వం తలపెట్టిన సర్వే ద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారి వారి హద్దుల ప్రకారం కొలతలు ఏర్పాటు చేయడం జరుగు తుందన్నారు. గ్రామంలో సర్వే బందానికి రైతులు సహకరిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సర్వేలో స్థానిక సర్పంచ్ నాయుడు సురేష్, వాణిజ్య విభాగ అధ్యక్షులు మెట్టా వెంకట్రామిరెడ్డి, దేవిరెడ్డి ప్రసాద్ రెడ్డి, శిగినం రవి, మత్స్యకార సొసైటీ చైర్మన్ గొల్ల పోతు నారాయణ, సర్వేయర్ మల్లికార్జున, రైతులు పాల్గొన్నారు.



ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి

ప్రజాశక్తి-ఉదయగిరి: ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్ ప్రకారం గ్రామ వాలంటరీలు సహకారంతో జగనన్న ఇళ్లను నిర్మాణాలు పూర్తి కావాలని ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ పేర్కొన్నారు. గురువారం మండల ంలోని కొండయపాలెం గ్రామపం చాయతీ పరిధిలోని జగన న్న లేఅవుట్‌ను హౌసింగ్ ఎఇ రామారావుతో ఎంపీడీఓ పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మా ట్లా డుతూ ఇంజినీరి ంగ్ అసిస్టెం ట్‌లు ప్రభ్వుతం చెప్పిన టార్గెట్ లక్ష్యాలను చేరువు కావాలన్నా త్వరగా పూర్తి చేయాలన్న గ్రామ వాలంటరీల సహాయంతో ఇచ్చిన ఇళ్లను వారు త్వరగా కట్టుకొనే విధంగా అవగాహన కల్పించి నిర్మించాలని పలు సూచనలు చేశారు. వివిధ వాటిపై వర్క్ లు పెండింగ్‌లో లేకుండా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్ లు పాల్గొన్నారు.


పరిశీలిస్తున్న అధికారి

నిందితులు అరెస్ట్

ప్రజాశక్తి - కావలి: ఒకహత్య, రెండు దొంగతనాలు, స్నాచింగ్ కేసులలో నిందితులైన ఒక నేరస్తుడు, ఇద్దరు బాలనేరస్తులను కావలి ఒకటవ పోలీసు స్టేషన్ సిఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెండు సెల్‌ఫోన్లు.,ఒక స్కూటీలతో సహా గురువారం అరెస్ట్ చేశారు. ఈసందర్భంగా కావలి డిఎస్‌పి వెంకటరమణ తన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నిందితులు ఎస్‌కె.ఫయాజ్,మరో ఇద్దరు బాలనేరస్తులు కావలి రూరల్, 1వపట్టణ, 2వపట్టణ, వెంకటగిరి పోలీసు స్టేషన్‌లలో పలు నేరాలలో నిందితులుగా ఉన్నారని తెలిపారు. వారిని గురువారం ఉదయం 1వపట్టణ సి.ఐ.కె.శ్రీనివాసరావు, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులురెడ్డి, కానిస్టేబుల్స్ భానుచంద్, విజయశంకర్, శివకుమార్‌లు అరెస్ట్ చేశారని తెలిపారు. అందుకు సంబంధిత సిబ్బందిని అభినందించారు.



మాట్లాడుతున్న డిఎస్‌పి

రోడ్డు భద్రతపై ఆటో డ్రైవర్లకు అవగాహన


ఆత్మకూరులో


కొడవలూరులో


మర్రిపాడులో


ఉదయగిరిలో

ప్రజాశక్తి-మర్రిపాడు

స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ విశ్వనాథరెడ్డి ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రయాణికుల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలన్నారు. యూనిఫామ్ తప్పనిసరిగా ధరించాలని, వాహన ధ్రువ పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వాహనం నడిపే సమయంలో రోడ్డు భద్రత నియమాలు పాటించి, డ్రైవింగ్ లైసెన్సు, వాహనాలకు ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. ఆటో, టాటా మ్యాజిక్‌లలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించినచో జరిమానా విధిస్తామన్నారు.మద్యం సేవించి వాహనం నడిపినా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ప్రజాశక్తి-కొడవలూరు

ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ జి.సుబ్బారావు హెచ్చరించారు. మండలంలోని నార్త్ రాజుపాలెం ఆటో స్టాండ్‌లోని ఆటో డ్రైవర్‌లకు గురువారం అవగాహన కల్పించారు. పరిమితికి మించి అధిక ప్రయాణికులను తరలించడం ద్వారా ప్రమాదాలు జరిగితే అధిక ప్రాణ నష్టం జరుగుతుందన్నారు దాచేపల్లి వద్ద జరిగిన ఆటో ప్రమాదాన్ని ప్రతి ఒక్కరూ దష్టిలో ఉంచుకోవాలన్నారు. అధిక ప్రయాణికులను తరలిస్తే వారిపై కేసు నమోదు చేసి వాహనాన్ని సిజ్ చేస్తామని చెప్పారు. అదేవిధంగా ఆటోకు సంబంధించిన అన్ని పత్రాలను తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. ప్రతి ఆటోకు పోలీసులు ఇచ్చిన నెంబర్ విధిగా కలిగి ఉండాలని చెప్పారు. రాత్రి తిరిగే ఆటోలు తప్పనిసరిగా అనుమతి పొందాలని సూచించారు. ఆటోలకు కేటాయించిన ప్రయాణికులను మాత్రమే తరలించి పోలీసులకు సహకరించాలని కోరారు.

ప్రజాశక్తి-ఆత్మకూర్ అర్బన్

ఆటో డ్రైవర్లు రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని ఆత్మకూరు ఎస్ఐ శివ శంకర్ రావు ఆదేశించారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ బస్టాండ్ వద్ద ఆటో డ్రైవర్లకు సూచించారు. వాహనదారులు అతివేగంగా వెళ్లకుండా నిర్ణీత వేగంతో వాహనాలు నడపాలని సూచించారు. అతివేగం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని వారికి సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని తెలిపారు. రోడ్డు నిబంధనలో అతిక్రమించి ఎవరు వాహనాలు నడిపిన కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఆటో డ్రైవర్లకు సూచించారు.

ప్రజాశక్తి-ఉదయగిరి

ఆటో డ్రైవర్లకు నియమ నిబంధనలు పాటించాలని స్థానిక సిఐ గిరిబాబు ఆటో డ్రైవర్లకు గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, ప్రతి ఆటో డ్రైవర్ లైసెన్స్‌తో పాటు యూనిఫారం కలిగి ఉండాలన్నారు. ప్రయాణికులతో మర్యాద పూర్వకంగా ఉంటూ వారి వారి గమ్య స్థానాలకు చేర్చాలని సూచించారు. నిబంధనలను పాటించని ఆటో డ్రైవర్ల పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ ఎన్ ప్రభాకర్ పాల్గొన్నారు.

కావలిలో 'ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి-కావలి.

కావలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ మాలేపాటి సుబ్బానాయుడు ఆధ్వర్యంలోగురువారం కావలి తెలుగుదేశం పార్టీకార్యాలయంలో పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో సుబ్బానాయుడు మాట్లాడుతూ.గత ఆరు నెలల నుంచి కావలి ప్రజలు పడుతున్న బాధలను తెలుసు కోవడానికి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఏర్పాటు చేసిన" ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి"కార్య క్రమం నేటితో ముగిసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా తాము కావలి నియోజకవర్గంలోని ప్రజల బాధలను పూర్తిస్థాయిలో తెలుసుకునే ందుకు అవకాశం దొరికిందని పేర్కొన్నారు. తేది: 26-11-2022న రాష్ట్రవ్యాప్తంగా "ఇదేమి ఖర్మ రాష్ట్రానికి" కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. తెలుగుదేశంపార్టీ కార్యకర్తలతో కలిసి ఈ కార్యక్రమంలో తిరిగేటప్పుడు ప్రజల నుండి అనూహ్య స్పందనను చూశామన్నారు. ఎప్పుడు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అవుతారా? అని ప్రజలు ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఇంటింటికి తిరిగి తెలుగుదేశం పార్టీ కరపత్రాలను పంచుతూ.. వారి సమస్యలు అడిగినప్పుడు.. ప్రజలు వారి ఆవేదనను వ్యక్తం చేశారన్నారు. పెన్షన్... రేషన్... పంపిణీలో వైసిపి ప్రభుత్వం ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కల్తీ మద్యం... విద్యుత్ ఛార్జీల పెంపు... నిత్యావసర ధరల పెంపు... తాగునీటి సమస్య... తుమ్మలపెంట రోడ్డు పరిస్థితి... గ్రావెల్ మాఫియా... జగనన్న కాలనీలో అవినీతి... టిడ్కో గహాలు... అక్రమ లేఅవుట్లు... నిర్మాణం కానీ రైతు కాలువలు... అమలు కాని ఆరోగ్యశ్రీ... ఎవరికి అందని రంజాన్ తోఫా... ఇలా ప్రజల సమస్యలు చెప్పుకుంటూ దయనీయ స్థితిలో కావలి ప్రజలు ఉన్నారన్నారు. వీటికి కారణం ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి అని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేకి చిత్తశుద్ధి ఉంటే తాను విసిరిన సవాల్ ని స్వీకరించాలని ఈ సందర్భంగా తెలియజేశారు. ఇదేమి ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో ప్రజల వద్ద నుండి సేకరించిన సమస్యల పత్రాలను పార్టీ ఇన్‌ఛార్జ్ సుబ్బానాయుడు జెండా ఊపి కారులో నెల్లూరుపార్లమెంటు నియోజకవర్గ కార్యాలయానికి పంపారు. సమావేశంలో రాష్ట్ర పార్టీ కార్యదర్శి మొగిలి కల్లయ్య, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు మన్నవ రవిచంద్ర, కావలి పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, జిల్లా రైతు విభాగం ఉపాధ్యక్షులు బొట్లగుంట శ్రీహరి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాలేపాటి సుబ్బానాయుడు

మారణాయుధాలతో దాడి

ఇరువురికి గాయాలు

ప్రజాశక్తి-ఇందుకూరుపేట: మండలంలోని ముదివర్తిపాలెం గ్రామంలో గురువారం ఒకే సామాజిక వర్గానికి చెందిన రెండు గ్రూపులు మారణాయుధాలతో దాడికి పాల్పడ్డారు. దాడిలో గాయపడ్డ వారిని ఇందుకూరుపేట ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. ఇరువురి ఫిర్యాదుతో ఇందుకూరుపేట ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


ట్రైసైకిల్ అందజేస్తున్న నాయకులు

ట్రై సైకిల్ వితరణ

ప్రజాశక్తి-ఇందుకూరుపేట: మండలంలోని గంగపట్నం గ్రామంలో నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి సహాయంతో ట్రై సైకిల్‌నీ వైసిపి మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో గంగపట్నం గ్రామానికి చెందిన హరినాథ్ అనే వ్యక్తికి ట్రై సైకిల్ ఉచితంగా అందజేశారు. సైకిల్ ఖరీదు సుమారు రూ.35వేలు ఉంటుందనీ ఇది బ్యాటరీతో నడుస్తుందన్నారు. సులువుగా వికలాంగులు నడపవచ్చునని మావులూరు శ్రీనివాసులు రెడ్డి అన్నారు. కార్యక్రమంలో గ్రామ వైసిపి నాయకులు పంబాల జనార్దన్ రెడ్డి, మహేందర్ రెడ్డి, సంతోష్ గౌడ్, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్లకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-మర్రిపాడు: స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలోగ్రామ వాలంటీర్లకు ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ మస్తాన్‌ఖాన్ గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండ లంలో ఖాళీగా ఉన్న 8 గ్రామ వాలంటరీ పోస్టులకు 14 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నా రన్నారు.ఈ ఇంటర్వ్యూలో ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించి పలు ప్రశ్నలను అడిగారు.అర్హత సాధించిన అభ్యర్థులకు త్వరలో నియామక పత్రాలు అందజేస్తా మన్నారు. ఎంపికైన వారు నిష్పక్షపాతంగా వాలంటీర్లకు కేటాయించిన 50 కుటుంబాల వారికి ప్రభుత్వం అందజేసే సంక్షేమ పథకాల అందేలా చూడాలన్నారు.

పార్కుల్లో మెరుగైన వసతులు


ప్రజాశక్తి-నెల్లూరు: నగరంలోని అన్ని పార్కులలో పచ్చదనాన్ని పెంచి, ఉత్సాహాన్ని పెంపొందించే ఆట వస్తువులతో పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేలా చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్ అధికారులను ఆదేశించారు. ఇంజనీరింగ్ అధికారులతో కలిసి నగరంలోని స్వతంత్ర పార్కు, పినాకినీ పార్కు, ఆదిత్య నగర్ లోని బాలసుబ్ర మణ్యం పార్కు, చిల్డ్రన్స్ పార్కులను కమిషనర్ గురువారం పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ వేసవి సెలవుల నేపధ్యంలో ఎక్కువ మంది చిన్నారులు పార్కులను సందర్శిస్తారని, వారి ఆహ్లాదానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పార్కులలో కల్పించాలని సూచించారు. నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ సంపత్ కుమార్, ఈ.ఈ చంద్రయ్య, డి.ఈలు అనిల్, సురేష్, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై సమీక్ష

ప్రజాశక్తి-నెల్లూరు: రానున్న సార్వత్రిక ఎన్నికల దష్ట్యా సార్వత్రిక ఎన్నికలు సజావుగా జరిగేందుకు కేంద్ర ఎన్నికల సంఘం జారీ చేసే మార్గదర్శకాలను అనుసరిస్తూ స్టాండర్డ్ ఆపరేటింగ్ సిస్టం అమలుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా కల్లెక్టర్‌కు సూచించారు.రానున్న సార్వత్రిక ఎన్నికల దష్ట్యా గురువారం మధ్యాహ్నం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వెలగపూడి నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు, ఎన్నికలు సజావుగా జరిగేందుకు స్టాండర్డ్ ఆపరేటింగ్ సిస్టం ఏర్పాటుకు చర్యలు, పెండింగ్ ఎన్నికల అంశాలు, ప్రింటింగ్ ఆఫ్ పివిసి ఎపిక్ కార్డులు ప్రింటింగ్ సరఫరా,సంబంధిత ఓటరుకు స్పీడ్ పోస్ట్ ద్వారా పంపడం రానున్న సార్వత్రిక ఎన్నికల లో అనుసరించాల్సిన విధివిధానాలపై తదితర అంశాలపై కలెక్టర్‌తో సమీక్షించారు. ఎస్.ఆర్. శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి కలెక్టర్ యం. హరి నారాయణన్, డిఆర్ఓ వెంకట నారాయణమ్మ, డ్వామా పిడి వెంకట్రావు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్ లో మాట్లాడుతూ, పెండింగ్ క్లైమ్స్, అబ్జెక్షన్స్ పై దష్టి సారించి ఎలాంటి పొరపాట్లుకు తావివ్వకుండా పరిష్కరించే దిశలో చర్యలు తీసుకోవాలన్నారు.


పలుచోట్ల ఓ మోస్తరు వర్షం

ప్రజాశక్తి-విడవలూరు: మండల పరిధిలోని సముద్ర తీర ప్రాంతాలైన ఊటుకూరు, రామతీర్థం, ముదివర్తి, అన్నారెడ్డిపాళెం, విడవలూరు గ్రామాలలో గురువారం ఓ మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం ఉన్నట్టుండి ఒక్కసారిగా ఆకాశం నల్లటి దట్టమైన మేఘాలతో కమ్ముకుని ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. దీంతో ఉదయం నుంచి అధిక ఉష్ణోగ్రతలు. ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న వద్ధులు, పిల్లలకు ఈ వర్షం కొంత ఉపశమనాన్ని ఇచ్చిందని మండల ప్రజలు తెలిపారు.



ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో గురువారం ఈదురు గాలులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. ఈదురు గాలులకు ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. దాంతో విద్యుత్తు లైన్లో దెబ్బ తినడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. విద్యుత్ శాఖ అధికారులు ప్రాతిపదికదన మరమ్మతులు చేపట్టేందుకు రంగంలోకి దిగారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భానుడు ప్రతాపానికి అల్లాడిన ప్రజలకు వాతావరణం చల్లబడడంతో కొంత ఉపశమనం కలిగింది. తేలికపాటి వర్షం పడటంతో మూగజీవుల తాగునీరు పశుగ్రాస సమస్య కొంతమేర ఊరటనిచ్చింది.


చెట్టు పడిన దృశ్యం

పర్యావరణ పరిరక్షణకు సహకరించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి: పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వాడటం నిషేధించుటకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆటవిశాఖ రేంజ్ అధికారి ఉమామహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక బీసీ కాలనీ సాయిబాబా గుడి ఆవరణలో ప్లాస్టిక్ నివారణ చర్లపై భక్తులకు స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 5వ తేదీ వరకు చేపట్టే ప్రపంచ పర్యావరణ సందర్భంగా ఈ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకం నిషేధించాలని, నీటి వనరులను సమద్ధిగా వాడుకోవాలన్నారు. అనంతరం గుడి ఆవరణలో గల ప్లాస్టిక్‌ను భక్తులు, స్థానికులు సహకారంతో ప్లాస్టిక్ ను శుభ్రం చేశారు. కార్యక్రమంలో విఆర్ఓ శ్రీనివాసులు, ఎఫ్ఓ ఉదయగిరి శ్రీనివాసులు, ఎఫ్‌బిఓలు లక్ష్మీ ప్రసన్న, సరిత, ప్రసాద్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.



20చోట్ల అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు

ప్రజాశక్తి-నెల్లూరు: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేసేందుకు, తరచూ ఫ్యూజులు పోతున్న, ఓవర్ లోడ్ కారణంగా ట్రాన్స్ ఫార్మర్లు ట్రిప్ అవుతున్న 20 ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసేందుకు ఎస్‌ఈ అనుమతులు ఇచ్చారని నగర ఎ.ఇ ఏ.సోమశేఖర్‌రెడ్డి తెలి పారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అధికారుల దృష్టికి వచ్చిన విజ్ఞప్తులను పరిశీలించి 20 ప్రాంతాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, మరో 6 ప్రాంతాల్లో ఉన్న ట్రాన్స్ పార్మర్ల సామర్థ్యం పెంపుదల చేసేందుకు చర్యలు తీసుకుం టున్నామన్నారు.

సచివాలయంలో తహశీల్దార్ తనిఖీ

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని డిసిపల్లి గ్రామ సచివాలయాన్ని ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ ఆనందరావు ఆకస్మిక తనిఖీ చేశారు.అనంతరం రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలిచ్చారు. పలురకాల పనుల కోసం సచివాలయానికి వచ్చే ప్రజలను తిప్పుకోకుండా అందుబాటులో ఉండి వారికి సహకరించా లన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న దృశ్యం



విద్యార్థులు గ్రంథాలయాలకు వెళ్లాలి

ప్రజాశక్తి-మర్రిపాడు

స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొం టున్నారు. గురువారం గ్రంథాల యాధికారి నారాయణ రావు విద్యార్థులకు తనదైన శైలిలో విజ్ఞాన విషయాలను బోధిస్తూ, మ్యూజికల్ చైర్స్, చిత్రలేఖనం, ఎక్సర్‌సై జులను నిర్వహి స్తుండడంతో విద్యార్థులు ఆనం దం వ్యక్తం చేశారు. పుస్తక పఠనం, కథలు చెప్పడం, మ్యాథ్స్‌లో సులభ గుణ కారం, తెలుగు భాషా బాగాలు, జంబ్లింగ్ పదాలు మొదలైన వాటిని శిక్షణలో విద్యార్థుల కిచ్చారు. వీటిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.


బహుమతులు అందజేస్తున్న దృశ్యం

వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి-ఎఎస్‌పేట: పట్టణ శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించినట్లు భాండాగార అధికారి శ్రీనివాసరాజు తెలిపారు.గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక ఎంపిపి ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు కథలు చెప్పడం, కథల పుస్తకాలు చదివించడం, వార్త విశేషాలను వివరించారు.పుస్తక పఠనం వల్ల పిల్లల్లో ఊహా శక్తి పెరుగు తుంద న్నారు.తద్వారా పిల్లల్లో నైతిక విలువలు పెపొందు తాయ న్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు

అవస్థల్లో ప్రజలు

ప్రజాశక్తి-విడవలూరు: మండల పరిధిలోని పలు ప్రాంతాలలో ఉదయం 10 గంటల నుంచి నిప్పులకొలిమిలా ఎండలు కాస్తున్నాయి. ప్రజలు ఎవరు బయట తిరగ వద్దని, అత్యవసర పరిస్థితులలో తగిన జాగ్రత్తలు తీసుకొని తిరగాలని మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి తెలిపారు.మండల కేంద్రంలో గరిష్ట ఉష్ణోగ్రత 43.6 డిగ్రీలుగా నమోదైంది. మండలంలోని ప్రజలు, జాగ్రత్తలు పాటించి మజ్జిగ, కొబ్బరినీళ్ళ, మంచినీళ్లు ఎక్కువగా తీసు కోవాలని వైద్యాధి కారి సూచించారు.ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో వయోవద్ధులు, చిన్నారులు, రైతులు బయటకు రాకుండా ఎండ దెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటిం చాలని తెలిపారు.


మాట్లాడుతున్న ధనుంజయరెడ్డి

కలిసికట్టుగా పని చేద్దాం..

ప్రజాశక్తి-ఉదయగిరి

వైసిపి బలోపేతం కోసం నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేద్దామని ఉదయగిరి నియోజకవర్గం వైసిపి పరిశీలకులు మెట్టుకూరు ధనుంజయ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎంపీపీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా వైఎస్ఆర్ సీపీకి ఓటు బ్యాంకు ఎక్కడికి పోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సంక్షేమ కార్యక్రమాలే తిరిగి అధికారంలోకి తీసుకువస్తుందని దీమా వ్యక్తం చేశారు. అందరూ కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నియోజకవర్గంలో ఏర్పడిన పరిణామాల రీత్యా ఇన్‌ఛార్జిల బాధ్యతలు అప్పజెప్పేందుకు అధిష్టానం పరిశీలిస్తుందని అత్యంత తొందరలో నియోజకవర్గానికి ఇన్‌ఛార్జిని ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థి ఎవరైనా సరే జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి చేసుకోవడమే అంతిమ లక్ష్యంగా మనందరి బాధ్యతగా గుర్తించాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తున్నారని అది హర్షించదగ్గ విషయమేనని అన్నారు. మండల పరిస్థితి కి వస్తేమండల పరిధిలో మూలే.వినయ్ రెడ్డి తన పరిధిలో తానుమండల అభివద్ధి కోసం పార్టీ ప్రతిష్ట కోసం నిరంతరం శ్రమిస్తున్నారని నాయకులు, కార్యకర్తలు ఆయనకు సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రతి కుటుంబానికీ ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందజేస్తుందన్నారు. ఆ సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్షగా మారుతాయని సీతారాంపురం మండలం మాజీ జెడ్పిటిసిదుగ్గిరెడ్డి గురువారెడ్డి అన్నారు. అనంతరం మాజీ సొసైటీ అధ్యక్షులు పరిశీలకు లను శాలువాలు పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గండిపాలెం మాజీ ఎంపీటీసీ పాముల రమణయ్య,బీసీ సంక్షేమ రాష్ట్ర అధ్యక్షుడు పి సి అల్లూరు రాజు, అంకినపల్లి ఓబుల్ రెడ్డి, దస్తగిరి అహ్మద్, గానుగపెంట ఓబుల్ రెడ్డి, అంబటి సుబ్బారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కారును ఢీకొట్టిన లారీ

తహశీల్దార్‌కు గాయాలు

ప్రజాశక్తి-నెల్లూరు: చెముడు గుంట వద్ద జాతీయ రహదారిపై ఎంఆర్‌ఓ ప్రయాణిస్తున్న కారును లారీ ఢీకొన్నది. గురువారం చిల్లకూరు మండల కార్యాలయానికి కారులో వెళ్తుండగా లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది.ఈ ప్రమాదంలో చిల్లకూరు తహశీల్దార్ ఆజ్మతుల్లాఖాన్ కు తటిలో ప్రమాదం తప్పి స్వల్ప గాయాలకు గురైయ్యారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ ఎంఆర్‌ఓను ప్రాథమిక చికిత్స కోసం నగరంలోని ఓ ఆసుపత్రికి తరలించారు.